25022025-DIS-04_Layout 1 2/25/2025 1:58 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

సర్కారు నిర్లక్ష్యం ఫలితం

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత నిర్వాకం శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) పథకం భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టింది. సాంకేతికంగా సంక్లిష్ట రీతిలో పనులు మొదలు బెట్టి మూడడుగుల ముందుకు ఆరడుగుల వెనక్కు అన్నట్టుగా నత్త నడకన పనులు చేయడమే కాకుండా ఇప్పుడు తొందరపాటుతో మొత్తం ప్రాజెక్టును ముప్పులోకి నెట్టింది. తాజాగా పనులు పునః ప్రారంభమైన నాలుగో రోజే సొరంగం కుప్పకూలింది. 42 మంది తృటిలో ప్రాణాపాయం తప్పించుకున్నారు. 8 మంది మాత్రం లోపల చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు వివిధ విభాగాలు రంగంలోకి దిగాయి. నాగార్జునసాగర్ డ్యాం సమీపంలోని సుంకిశాల ఇంటేక్ వెల్ రక్షణ కుడ్యం కుప్పకూలిన వెనువెంటనే ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. వీటి వెనుక సర్కారు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. అవినీతి, అసమర్థత ప్రాజెక్టులతో పాటుగా మనుషుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. నాణ్యత పరిశీలన, పర్యవేక్షణలో ప్రభుత్వ వైఫల్యం వల్లే వరుస దుర్ఘటనలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నాయకత్వం ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఉత్తరాఖండ్‌లో 2023లో టన్నెల్ ప్రమాదం జరిగితే ఉన్నతస్థాయి సాంకేతికతను, నైపుణ్యాలను రంగంలోకి దింపి కాపాడగలిగారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై సహాయక చర్యలపై నిపుణులు అసంతృప్తి వ్యక్తం చేయడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సహాయ కార్యక్రమాలను తగిన రీతిలో నిర్వహించవచ్చనే మాట వినిపిస్తున్నది.

తన దాకా వస్తేగానీ తత్వం బోధపడదంటారు పెద్దలు. కొందరు బోధపడినా నిద్ర నటిస్తూ తప్పించుకోవాలని చూస్తారు. మన సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి అలాగే ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒకటి రెండు పిల్లర్లు కుంగితే ఆ సంగతి ఇల్లెక్కి కూశారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని పిలిపించి శ్లాబుల మధ్య ఉండే సందులను పగుళ్లుగా ప్రచారం చేశారు. మొత్తం ప్రాజెక్టే పనికిరాకుండా పోయిందని నానా హంగామా చేశారు. ఎవరి ప్రాణాలకు హాని కలుగని సాదాసీదా ప్రాజెక్టు సమస్యపై ఇంత రాద్ధాంతం చేసిన సీఎం ఇప్పుడు శ్రీశైలం ఎడమకాల్వ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో మట్టిపెళ్లలు విరిగిపడి ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలు ప్రమాదంలో పడితే నోరు మెదపడం లేదు. టింగురంగా అంటూ ప్రచారాలు, పర్యటనలు, ప్రారంభోత్సవాలు యథావిధిగా కొనసాగిస్తున్నారు. కాళేశ్వరం పూర్తిగా కేసీఆర్ ముద్ర వేసుకున్న ప్రాజెక్టు కావడం వల్లనే బురదజల్లాలని చూశారు. చిన్న పాటి సమస్యను భూతద్దంలో చూపి ప్రాజెక్టునే పడావు పెట్టేందుకు తెగించారు. దీని ఫలితంగా వ్యవసాయం అటకెక్కినా ఫరవా లేదన్నట్టుగా పోతున్నారు. ఇది రాస్తున్న సమయానికి సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది పరిస్థితిపై ఇదమిత్థంగా సమాచారం ఏదీ రాలేదు.

సీఎంకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేసి ప్రమాదం గురించి వాకబు చేశారని, పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని వార్తలు వచ్చాయి. అయితే సీఎం ప్రమాదం గురించి ఏమనుకుంటున్నారు? ఏం చేయాలనుకుంటున్నారు? అనే సంగతి బయటకు రాలేదు. సహాయచర్యల బాధ్యత మంత్రులకు అప్పగించి ఆయన చేతులు దులిపేసుకున్నారు. కొంపలు అంటుకుపోతుంటే గుంపుమేస్త్రీకి ఎలాంటి బాధ్యత ఉండదా? ప్రమాదంలో చిక్కుకున్న వారి ప్రాణాలను కాపాడటం కన్నా తన పదవిని కాపాడుకోవడం మీదే సీఎంకు ఎక్కువ ధ్యాస ఉన్నట్టుంది. 'నన్ను విలన్‌లా చూస్తున్నారు, కాపాడమని' కాంగ్రెస్ బీసీ నేతల సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం.

ఇదీ ఎస్ఎల్‌బీసీ కథ!

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ప్రతి సాగునీటి ప్రాజెక్టు తెలంగాణకు జరిగిన ద్రోహానికి సాక్ష్యమే! తాజాగా ఇవుడు వార్తల్లోకెక్కిన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ పథకం దానికి మినహాయింపు కాదు. ఇంకా చెప్పాలంటే ఆంధ్ర ప్రాంతీయులు తెలంగాణకు చేసిన ద్రోహాన్ని సరిదిద్దడానికి తెలంగాణకు చెందిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆయన చొరవతో పురుడు పోసుకున్న పథకమిది.

ఎస్జీవీ శ్రీనివాసరావు

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ పథకం కథ చాలా పెద్దది. దీని గురించి చెప్పాలంటే అనేక తరాల వెనక్కి వెళ్లాలి. తెలంగాణ ప్రయోజనాలను కేంద్రరాష్ట్రాల్లో అధికారం చెలాయించిన కాంగ్రెస్ పార్టీ ఎలా కాలరాచిందీ తెలుసుకోవాలి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ముందు ఆంధ్ర ప్రాంతం మద్రాస్ రాష్ట్రంలో ఉంటే, తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంలో ఉండేవి. ఆ కాలంలోనే మద్రాసు, హైదరాబాద్ రాష్ట్రాలు కలిసి కృష్ణా నదికి ఉపనది అయిన తుంగభద్ర మీద నిధులు వెచ్చించి తుంగభద్ర ప్రాజెక్టును నిర్మించాయి. తర్వాత కాలంలో కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైంది. అప్పటికే గోదావరి బ్యారేజ్, కృష్ణా బ్యారేజీల వల్ల కలిగే ప్రయోజనాలు, అవి సృష్టించిన సంపద చూసిన ఆంధ్ర ప్రాంతీయులు తుంగభద్ర ప్రాజెక్టు ఉన్న బళ్లారి జిల్లాను ఆంధ్రలో కలుపుకోవాలని విశ్వప్రయత్నం చేసినా అది సాకారం కాలేదు. దీనితో వారి దృష్టి కృష్ణానది మీదికి మళ్లింది. ఆ నది మీద ఇవాల్టి శ్రీశైలం కు కాస్త అటుఇటుగా సిద్దేశ్వరం ప్రాజెక్టు, నాగార్జున సాగర్ సమీపంలో పులిచింతల ప్రాజెక్టులు కట్టాలని డిమాండ్లు మొదలయ్యాయి. ఎందుకంటే సిద్దేశ్వరంతో రాయలసీమ, పులిచింతలతో కోస్తాంధ్ర సస్యశ్యామలమవుతాయి.

> **ఇదే సమయంలో ఇటు హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం ఇదే నది మీద ఎగువన అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, దిగువన ఏలేశ్వరం ప్రాజెక్టుకోసం ప్రతిపాదనలు రూపొందించింది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుతో హైదరాబాద్ ప్రతిపాదనలు చెత్తబుట్ట పాలయ్యాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో అప్పర్ కృష్ణా ప్రాజెక్టు కట్టాల్సిన ప్రాంతం కర్నాటకలోకి వెళ్లి పోయింది. దానితో అప్పర్ కృష్ణా ప్రాజెక్టు ప్రతిపాదన కాలగర్భంలో కలిసిపోయింది.**

ఇక మిగిలిన ఏలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో ఇపుడు నాగార్జునసాగర్ కట్టిన నందికొండ వద్దకు మార్చారు. ఇక్కడే తెలంగాణ ప్రయోజనాలు శాశ్వతంగా దెబ్బతిన్నాయి. ఎందుకంటే ప్రతిపాదిత ఏలేశ్వరం ప్రాజెక్టు ప్రాంతం నందికొండతో పోలిస్తే సముద్ర మట్టానికి ఎత్తున ఉంటుంది. అక్కడ నిపుణులు సూచించినట్టు రెండు కొండల మధ్య ప్రాజెక్టు కడితే నల్లగొండ ఉమ్మడి జిల్లా మొత్తానికి, ఇంకా ఆపై ప్రాంతాలకు గ్రావిటీ కాల్వల ద్వారా నీరు అందుతుంది. అయితే తమ ప్రాంతానికే నీరు మళ్లించుకోవాలన్న కుట్రతో ఆంధ్ర నీటిపారుదల ఇంజినీరు కేఎల్ రావు సూచన మేరకు దాన్ని దిగువకు తరలించి నందికొండ వద్ద కట్టారు. ఈ ద్రోహం ఇక్కడితో ఆగలేదు. తెలంగాణ వైపు కట్టిన నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కూడా సముద్రమట్టానికి చాలా దిగువన ఉంది. దీనితో ఎత్తున ఉన్న నల్లగొండ జిల్లాలో కొన్ని ప్రాంతాలకే సాగర్ నీరు పరిమితం కావలిసి వచ్చింది. వాస్తవానికి నల్లగొండ జిల్లా సాగు, తాగునీటి అవసరాలకు ఉన్న ఏకైక ఆధారం కృష్ణా నది మాత్రమే. ఏలేశ్వరంనుంచి గ్రావిటీ ద్వారా నీరందే అవకాశం నాగార్జునసాగర్‌కు ప్రాజెక్టు మార్పువల్ల శాశ్వతంగా దూరమైంది. 1969 ఉద్యమంలో ఈ అంశాన్ని ఉద్యమకారులు లేవనెత్తినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు పట్టించుకోలేదు. పైగా 1973లో ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జలాల కేటాయింపులపై నియమించిన బచావత్ ట్రిబ్యునల్‌కు కృష్ణా డెల్టా, కేసీ కాలువ అవసరాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరిందే తప్ప నల్లగొండకు నీరందించే ఏ పథకాన్నీ సూచించలేదు.

అయితే ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మర్రి చెన్నారెడ్డి అయిన తర్వాత ఈ అన్యాయాన్ని సవరించేందుకు 'నల్లగొండకు గ్రావిటీ ద్వారా సాగునీరందించే ప్రత్యామ్నాయ పథకాన్ని' రూపొందించాలని అధికారులను, సాగునీటి రంగ నిపుణులను ఆదేశించారు. 1978లో ఇచ్చిన ఈ ఆదేశం కార్యరూపం దాల్చడానికి నాలుగేండ్లు పట్టింది. 1981లో నిపుణులు ప్రత్యామ్నాయ పథకంగా ఎత్తున ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సొరంగ మార్గం ద్వారా నీరు తరలించేలా శ్రీశైలం ఎడమ గట్టు కాలువ పథకం చేపట్టాలని నివేదిక ఇచ్చారు. దీనిద్వారా మాత్రమే నల్లగొండకు గ్రావిటీ ద్వారా నీరు అందించే అవకాశం ఉందని తేల్చి చెప్పారు. దీనివల్ల సుమారు 3 లక్షల ఎకరాలకు సాగునీరు, దారి పొడవునా గ్రామాలకు తాగునీరు అందించవచ్చునని సూచించారు.

సొరంగమే ఎందుకు?: ఆ రోజుల్లో సొరంగం వంటి క్లిష్ట తరమైన ఆప్షన్ తీసుకోవడానికి కారణం ఉంది. ఎందుకంటే అప్పటి వరకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు అంతగా అనుభవంలో లేవు. ఉన్నా అవి చిన్నపాటి పథకాలు మాత్రమే. ఆ పథకాల సక్సెస్ శాతాలు అంత ఆకర్షణీయంగా కూడా లేవు. కాబట్టి ఆ రోజుల్లో లిఫ్ట్ పథకాల గురించి పెద్దగా ఆలోచించలేదు. ఇదిలా ఉంటే ప్రభుత్వం చెప్పిన పథకాలు ముందుకు పడకపోవడం, వరుస కరువులు, సాగునీటి కటకటల నేపథ్యంలో గోపాల్‌రెడ్డి అనే అభ్యుదయ రైతు.. తోటి రైతులతో కలిసి నిధులు సమీకరించి సాగర్ కాల్వల మీద అక్కడక్కడా లిఫ్ట్ పథకాలను చేపట్టారు. అంటే రైతులే తమ సొంత ఖర్చుతో లిఫ్టులు ఏర్పాటు చేసుకొని వాటి కరెంటు బిల్లులు కూడా తమ జేబునుంచి పెట్టుకునే వారు. అయితే అప్పటికే ఆంధ్రలో కాల్వల మీద చిన్నచిన్న లిఫ్టులుండేవి. వాటిని మాత్రం ప్రభుత్వమే తన సొంత ఖర్చుతో నిర్వహించేది. తెలంగాణకు వచ్చేసరికి ఇవి రైతులే ఏర్పాటు చేసుకున్నారు కాబట్టి ఆ ఖర్చు వాళ్లే పెట్టుకుంటారన్నట్టు పట్టించుకోవడం మానేసింది. తెలంగాణ మలిదశ ఉద్యమం ప్రారంభమై కేసీఆర్ ఈ దుర్నీతిని ఎండగట్టేదాక ఇదే విధానం కొనసాగింది.

భారీ ఉద్యమాలు..ఎత్తిపోతల డిమాండ్లు: ఈలోగా నల్లగొండ నీటి కష్టాలు పెరగడం, ఫ్లోరోసిస్ సమస్య వెలికిరావడంతో జిల్లాకు సాగునీరు -తాగునీరు కావాలన్న డిమాండ్లతో రైతులు భారీ ఉద్యమాలు చేపట్టారు. మరోవైపు ఆ మధ్యకాలంలో దేశంలో అనేకచోట్ల ఎత్తిపోతల పథకాలు విజయవంతం కావడంతో సాగర్ మీద ఎత్తిపోతల పథకాలు చేపట్టి నీరివ్వాలనే డిమాండ్‌కు బలం చేకూరింది. రాష్ట్రంలో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాలు మరింత ఊపందుకున్న నేపథ్యంలో నల్లగొండ సాగునీటి సమస్య మీద అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు ఎప్పటిలాగే శ్రీశైలం- టన్నెల్ కథ వినిపించారు. అది తప్ప మార్గాంతరం లేదన్నారు. అయితే విపక్షాలు ఈ ప్రతిపాదనపై విరుచుకుపడ్డాయి. అసలు టన్నెల్ విధానంలో నిర్మాణం చేపడితే ఈ పథకం ఎప్పటికి పూర్తవుతుందని నిలదీశాయి. అప్పటిదాక నల్లగొండ పరిస్థితి ఏమిటని ప్రశ్నించాయి. అప్పటికే దేశంలో పలు ప్రాంతాల్లో లిఫ్ట్ పథకాలు బాగానడుస్తున్నాయి కాబట్టి తాత్కాలికంగానైనా సాగర్‌నుంచి నీటిని లిఫ్ట్ చేసి నల్లగొండకు ఇవ్వాలని పట్టుబట్టాయి. ముందు లిఫ్ట్ ద్వారా నీళ్లిచ్చి ఆ తర్వాత ఎస్సెల్బీసీ పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించాయి. ఈ వాదనను అన్ని పక్షాలు సమర్థించాయి. దీనికి ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఎన్టీఆర్ అధికారంలో ఉన్న దాదాపు 7 ఏండ్లలో ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తన సొంత ఎజెండా అమలులో భాగంగా ఎస్సెల్బీసీ పథకంలో మార్పులు చేశారు.

> **చంద్రబాబు బుర్రలో పుట్టిన తుంపర సేద్యం నిబంధనను ఈ పథకానికి అంటగట్టి ప్రతిపాదిత ఆయకట్టును రెండున్నర రెట్లు పెంచారు. ఎస్సెల్బీసీ నీటిని తుంపర సేద్యం పద్ధతిలో మాత్రమే వాడుకోవాలని నిబంధన విధించారు. దీనిపై రైతులు భగ్గుమన్నారు. ఆందోళనలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో ఆనాటి ప్రభుత్వం సాగర్ బ్యాక్ వాటర్ వద్ద పుట్టంగండి నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేసింది.**

అయితే ఆ లిఫ్ట్ పథకాన్ని వివిధ అవసరాలకు కేటాయించడంతో ఆనాటి శంకుస్థాపన కార్యక్రమం యుద్ధరంగంగా మారిపోయింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఓ ఎస్ఐ మరణించారు. చివరికి లిఫ్ట్ పథకం కాల్వల పనులు పూర్తయ్యాయి. అయితే ఎస్సెల్బీసీ పథకం మాత్రం ప్రారంభం కాలేదు. అదిగో ఇదిగో అనే మాటలతోనే నెట్టుకు వచ్చారు. ఈ పథకానికి కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుమతుల విషయంలో పెద్దగా సహకారం అందించలేదు.

> **భారీ బ్యాలెట్ నిరసన..:** ప్రభుత్వ తాత్సారానికి నిరసనగా ఉద్యమాలు వెల్లువెత్తడంతో పాటు 1996 పార్లమెంటు ఎన్నికల్లో 500 మందికి పైగా రైతులు నల్లగొండ ఎంపీ స్థానానికి నామినేషన్లు వేయడం ద్వారా తమ సమస్యను దేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆనాటి ఎన్నికల్లో బాలెట్ పేపర్‌ను ఒక దినపత్రిక సైజులో ముద్రించాల్సి వచ్చింది. పోలింగ్ బాక్సులు సరిపోక డ్రమ్ములు వినియోగించాల్సి వచ్చింది. మొత్తానికి నల్లగొండ సమస్య దేశం దృష్టికి వచ్చింది.

ఓట్ల వేటకు ఎస్సెల్బీసీ..: 1993-94 ప్రాంతంలో తెలంగాణ బిడ్డ, నల్లగొండ ప్రజల కష్టాలు తెలిసిన పీవీ నరసింహారావు ప్రధాని హోదాలో కలుగచేసుకున్న తర్వాతే ఎస్సెల్బీసీకి చాలా అనుమతులు వచ్చాయి. అయినా ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల నుంచి శుష్కప్రియాలు శూన్యహస్తాలు విధానమే కొనసాగింది. ప్రతి ఎన్నికలో ఈ పథకం పేరు చెప్పుకోవడం కాంగ్రెస్ నాయకులకు ఆనవాయితీగా మారింది. తర్వాత కాలంలో తెలంగాణ మలిదశ ఉద్యమం తలెత్తిన నేపథ్యంలో 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో రావటం, ఆనాటి ప్రభుత్వంలో టీఆర్ఎస్ భాగస్వామి కావడంతో తొలిసారి బడ్జెట్‌లో ఎస్సెల్బీసీకి కేటాయింపులు ప్రారంభమయ్యాయి. అయితే అటవీ, పర్యావరణ, న్యాయ సమస్యల కారణంగా మూడేండ్లు గడిచిపోయాయి. చివరకు 2007లో సుప్రీం కోర్టు క్లియరెన్స్ ఇచ్చాక లాంఛనంగా పనులు ప్రారంభమయ్యాయి.

ఎన్నో కష్టాలు..: అప్పటినుంచి ఆ సొరంగం పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పనుల్లో ప్రమాదాలు జరగడం కొత్త కాదు, గతంలో 2009 అక్టోబర్‌లో వచ్చిన వరదల్లో టన్నెల్ యంత్రం మునిగి పోయింది. దాన్ని బాగు చేసి పని చేయించడానికి 21 నెలల కాలం పట్టింది. భూసేకరణలో మరో సంవత్సరం గడిచింది. యంత్రానికి సమస్యలు, కాంట్రాక్టర్ బిల్లుల సమస్యలు వంటి వాటితో కాలహరణం జరుగుతూ వచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అసెంబ్లీలో ఈ పథకం మీద సుదీర్ఘ చర్చ జరిగింది. పథకం కార్యరూపం దాల్చేందుకు పాత ప్రభుత్వం వదిలిపోయిన రూ.150 కోట్లను కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది. కాంట్రాక్టర్ అడిగిన అన్ని సౌకర్యాలు సమకూర్చింది. అయినా పనుల్లో వేగం పుంజుకోలేదు.

పలుమార్లు డ్రిల్లింగ్ యంత్రం మొరాయించడం, మట్టి పెళ్లలు కూలిపడడం వల్ల నెలల తరబడి పనులు నిలిచిపోవడం సాధారణమై పోయింది. దీనివల్ల కాలహరణం జరుగుతూ వచ్చింది. ఎన్ని నిధులు కుమ్మరించినా.. ఎంత ఒత్తిడి చేసినా దీని తవ్వకానికి ఎన్నుకున్న టెక్నాలజీ.. డ్రిల్లింగ్ యంత్రం వేగం.. పనుల్లో పెద్ద పురోగతిని సాధించే అవకాశం లేకుండా చేశాయి. గతంలో వరద నీరు ప్రవేశించిన కారణంగానే దాదాపు రెండేండ్లు పనులు నిలిచిపోయిన అనుభవం దృష్ట్యా తాజా ప్రమాద తీవ్రత చూస్తే ఈసారి తిరిగి పనులు ప్రారంభించడానికి ఎంత కాలం పడుతుందనేది ఎవరూ చెప్పలేకుండా ఉన్నారు.



నియంతలు మళ్లీ రావచ్చు!

గడిచిన శతాబ్దాల్లో నియంతలు బలహీనులపై బలప్రయోగానికి పాల్పడేవారు. ప్రజలపై విచక్షణారహితంగా దాడులు చేసేవారు. అప్పట్లో వలసలు, బాలకార్మికులు సర్వసాధారణం. అవి పునరావృతమయ్యే ప్రమాదం ఉన్నది. మళ్లీ నియంతల యుగం రావచ్చు. వాటిని నియంత్రించే చర్యలు ఇప్పుడు అత్యావశ్యకం.

- వోకర్ టర్క్, ఐరాస మానవహక్కుల విభాగం హై కమిషనర్

'కుల విమోచన పోరాట సమితి' (కెవీపీఎస్) నేపథ్యం నుంచి ఎదిగివచ్చిన దళితుడు, సీపీఎం కార్యకర్త జాన్ వెస్లీ, ఆ పార్టీపై మొదటి నుంచి గల అగ్రకుల నాయకత్వ ఆధిపత్యాన్ని భంగపరుస్తూ, తెలంగాణ సీపీఎం కొత్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎంతో విశేషతతో కూడుకున్న ఈ పరిణామం అందరి దృష్టిని ఆకర్షించింది. పోరాటశీలత, శ్రమించి పనిచేసే తత్త్వం గలవాడనే పేరున్న ఆయన, రాగలకాలంలో ఆ పార్టీపై, పార్టీ కార్యకర్తలపై, ఆలోచనా సరళిపై, విధానాలపై, కార్యాచరణపై ఎటువంటి ముద్ర వేయవచ్చునన్నది ఆసక్తికరమైన విషయమవుతున్నది.

జాన్ వెస్లీ ముద్ర ఎట్లా మిగిలేను?

టంకశాల అశోక్

శ్రామికవర్గ రాజ్యాధికారమని సిద్ధాంతీకరించి, ఆ వర్గాల మద్దతుతోనే మనుగడ సాగించే కమ్యూనిస్టు పార్టీలు పార్టీ యంత్రాంగ ఉన్నత స్థానాలలో మాత్రం సదరు తరగతులకు, మహిళలకు తగిన అవకాశం ఇవ్వకపోవటంపై విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. అలాంటి స్థితిలో అనూహ్యమైన విధంగా జాన్ వెస్లీకి చోటు లభించింది. అందుకు కారణాలు ఏవైనప్పటికీ, పార్టీలోని శ్రామిక వర్గాలతో పాటు, బయటి ప్రజలు కూడా దీన్ని ఆహ్వానించవలసి ఉంటుంది. నియామకం జరిగినప్పటి నుంచి తన మునుపటి ధోరణిలోనే ఒక గట్టి కమ్యూనిస్టు వలె మాట్లాడుతూ, కార్యాచరణల గురించి చెప్తున్న ఆయన, రాగల కాలంలో ఏమేమి చేసి తన ముద్ర వేయగలో చూడవలసి ఉన్నది. పార్టీని శక్తివంతం చేసేవిధంగా పనిచేస్తూ అటువంటి ముద్రను గత కార్యదర్శులు వేయలేకపోయారు.

> **రాష్ట్రంలో సీపీఎంతో పాటు కమ్యూనిస్టు పార్టీల పరిస్థితి ఏ విధంగా ఉన్నదో తెలిసిందే. వెస్లీకి పార్టీ బాధ్యతలు లభించింది మహా క్లిష్ట స్థితిలో. అటువంటప్పుడు, ఎంతటి పోరాటశీలత, శ్రమించి పనిచేసే తత్వం గల నాయకునికైనా పార్టీని ఒక లోతైన కూపంలోంచి బయటకు తీసి ముందుకు తీసుకుపోగలగటం తేలికైన పనికాదు. అది కూడా ఒకవేళ ఆ పార్టీలో ఊడలు దించుకొని పాతుకుపోయిన వర్గాలు తనకు అవసరమైన స్వేచ్ఛ ఇవ్వని పక్షంలో. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో దళిత నాయకుడైన దామోదరం సంజీవయ్య ఉదంతం అనివార్యంగా గుర్తుకువస్తుంది. వెస్లీకి అటువంటి దుస్థితి ఎదురుకాకపోయినా, కమ్యూనిస్టులు అనుసరిస్తామని కనీసం పైకి చెప్తుండే ప్రజాస్వామిక కేంద్రీకృత (డెమోక్రటిక్ సెంట్రలిజం) పద్ధతులకు లోబడి అయినా ఎంతవరకు వెసులుబాటును ఇవ్వగలరో రాగల రోజులలో కనిపించనున్నది.**

సీపీఎం కొత్త కార్యదర్శి ఎదుట గల సవాళ్లు అనేకం. పైన చెప్పుకున్నట్టు, అన్ని సవాళ్లూ, కార్యాల అంతిమలక్ష్యం, తమ పార్టీని తమవారంతా కలిసి ఒక లోతైన కూపంలోకి నెట్టి మరీ తోయగా, దానిని గజ కళేబరం వలె సర్వశక్తియుక్తులు ఒడ్డి బయటకు లాగి ముందుకు నడిపించగలగటం. ఇక సవాళ్లు ఏమిటన్నది ఒక్కొక్కటిగా చూద్దాము. తమది తెలంగాణ శాఖ ఐనందున అన్నింటికన్న ముందు చేయవలసింది, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును సీపీఎం ద్వారా అధికారికంగా ఎండార్స్ చేయించటం. రాష్ట్ర ఉద్యమాన్ని తక్కిన అన్ని వామపక్షాలు ఏదో ఒక దశలో బలపరచటమో, తర్వాత ఒక రాష్ట్రంగా ఎండార్స్ చేయటమో జరుగగా, అందుకు ఈ 11ఏండ్ల తర్వాత సైతం నిరాకరిస్తున్న ఏకైక పార్టీ సీపీఎం. వారు ఆచరణలో ఏమైనా చేస్తుండవచ్చుగాక. కానీ, దాన్ని అడ్డుపెట్టుకొని సిద్ధాంతరీత్యా మాత్రం కాగితంపై ఎండార్స్ చేయకపోవటంలో చాతుర్యత తప్ప నిజాయితీ కనిపించదు. తాము అందరికీ మించిన సిద్ధాంత కర్తలమన్నది వారి ప్రగాఢ నమ్మకం.

సీపీఎం వైఖరికి సంబంధించి భాషా ప్రయుక్త రాష్ట్రాలు, ఆ పేరిట కోస్తా ధనిక వర్గాల దోపిడీలు, అణచివేతలు, సీపీఎం నేతల ప్రాంతీయలు, కుల ధోరణులు, అసలు లింగ్విస్టిక్స్ గురించీ, నేషనాలిటీస్ గురించి స్టాలిన్ రాసిందేమిటి, ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి ఒప్పందాల ఉల్లంఘనలు, ఆచరణలో ఏర్పడిన వైరుధ్యాలు, వాటిపై సీపీఎం చెప్పిందేమిటి, చేసిందేమిటి అన్న చర్చలు ఉద్యమ కాలంలో చాలానే జరిగాయి. వాటిపై స్వయంగా తమ పార్టీలో ముందుకొచ్చిన ప్రశ్నలను అణచివేసిన సీపీఎం రాష్ట్ర, కేంద్ర నాయకత్వాలు, ఆయా ప్రశ్నలకు నేటికీ సూటి సమాధానాలు చెప్పడం లేదు. చతురమైన విధంగా నిజాయితీ లేని దాటవేత ధోరణిని చూపుతున్నాయి. వారికి తెలంగాణలో ఉనికి కావాలి, ఇక్కడి కార్యకర్తలు కావాలి, ఇక్కడ ప్రజల మద్దతు, ఓట్లు, సీట్లు కావాలి. కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అక్షరాలా 11 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత కూడా దానిని ఎండార్స్ చేయరు. మార్క్సిజంలో ఇంత కపటపు నీతి ఉంటుందా? వారిని తెలంగాణ ప్రజలు మాత్రం ఎందుకు ఎండార్స్ చేయాలి?

జాన్ వెస్లీకి ఇదొక సవాల్ అవుతున్నది. ఆయన మహబూబ్‌నగర్ వంటి అత్యంత వెనుకబడిన జిల్లాకు చెందిన పేద కుటుంబపు మనిషి. ఇంతకుముందటి కార్యదర్శుల వలె సంపన్న జిల్లాలకు చెందిన సంపన్నుడు కారు. కనుక ఈ ప్రాంతపు బాధలు, ఆక్రోశాల గురించి తనకెవరూ చెప్పనక్కరలేదు. అటువంటి మట్టి మనిషి అయినందువల్ల తనపై ఈ విషయంలో ఆశాభావాలున్నాయి. అందువల్ల ఆయన తమ రాష్ట్ర, కేంద్ర నాయకులతో వాదించి ఒప్పించి, తెలంగాణ రాష్ట్రాన్ని ఎండార్స్ చేయించాలి. ఇక్కడి ప్రజలకు ఈ విషయంలో మొహాన్ని చూపించగలగాలి. గతంలో ప్రధాన కార్యదర్శి సీతారాం యేచూరి తెలంగాణకు బద్ధ విరోధిగా ఉండి ఏమేమి తంత్రాలు సాగించారో తెలియనిది కాదు. ఇప్పుడాయన లేరు. కొత్త ప్రధాన కార్యదర్శి ఎవరయ్యేదీ తెలియదు గాని (బీవీ రాఘవులు కాకుందురు గాక), ప్రకాశ్ కరత్ అటువంటి విరోధి కారు. పైగా ఇప్పుడు కొత్త విధాన నిర్ణయం ఏమీ ఉండదు, ఒక వాస్తవాన్ని ఎండార్స్ చేయటం తప్ప. అందువల్ల వెస్లీ దీనిపై దృష్టిపెట్టడం వారికే మేలు చేస్తుంది. అంతే తప్ప సమస్యలపై ఆర్థిక పోరాటాలంటూ ఏవో మొక్కుబడిగా చేస్తే ప్రజలు ఈ మాట మరిచిపోతారనే గత కార్యదర్శుల ఎత్తుగడలు ఫలించవని గ్రహించాలి ఆయన.

రెండవది, తెలంగాణ వంటి సామాజిక, ఆర్థిక స్థితిగతులు గల చోట పార్టీ బలోపేతం. తెలంగాణ ఏర్పడిన కొత్తలో వారు సుందరయ్య కేంద్రంలో పార్టీ బయటివారితో రెండు విస్తృతమైన సమావేశాలు జరిపి నోట్సులు చాలానే తీసుకున్నారు. తర్వాత డజను వామపక్షాలతో చర్చలు జరిపి డజనున్నర పాయింట్లతో ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. అప్పటి అధికార పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదగనున్నది తామేనని ప్రతినలు చేశారు. ఏడాది తిరగకముందే ఆచరణలు ఏమీ లేకపోగా ఐక్యత అ